క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు

ఏలేశ్వరం: పట్టణంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు సూచించారు. పట్టణ పరిధిలోని 1, 2, 3 సచివాలయాల్లో గురువారం జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇళ్ల స్థలాలతో పాటు నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం కల్పించిన సదుపాయాలతో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని కోరారు. హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, మెప్మా ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'తాటకి సంహారం'



తాటకి సంహారం వీధి నాటకంలోని ఓ సన్నివేశం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శ్రీగౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక కళాకారులు తాటకి (రాక్షస) సంహారం వీధి నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామంలోని నందిసెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ నాటకంలో రాముడిగా నానిపల్లి జాన్ ప్రసాద్, లక్ష్మణుడిగా నానిపల్లి అప్పలస్వామి, విశ్వామిత్రుడిగా దాడి లక్ష్మణ్, తాటకిగా నానిపల్లి వెంకన్న నటించారు. సీనియర్ కళాకారులు రాయి సుబ్బారావు, దాడి శ్రీను మేకప్–డ్రెసింగ్ చేశారు.

అమ్మవారి విగ్రహం అపహరణ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సతీష్, సిబ్బంది

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో దుర్గాదేవి అమ్మవారి విగ్రహం చోరీకి గురైంది. గ్రామంలో సుమారు 30 ఏళ్ల క్రితం నెలకొల్పిన విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు గురువారం అపహరించారు. ఉదయాన్నే ఆలయానికి వచ్చిన భక్తులు విగ్రహం లేకపోవడాన్ని గుర్తించారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై జి.సతీష్ తన సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. విగ్రహం అపహరణపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విగ్రహం ఏర్పాటు చేసిన స్థలంపై కొంతకాలంగా వివాదం నెలకొంది.

సత్యదీక్ష వస్త్రాల పంపిణీ



గెద్దనాపల్లిలో భక్తులకు సత్య దీక్ష వస్త్రాలను అందజేస్తున్న కృష్ణబాబు

కిర్లంపూడి: మండలంలోని గెద్దనాపల్లిలో భక్తులకు అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి దీక్షా వస్త్రాలను గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు మాట్లాడుతూ అన్నవరం సత్యనారాయణ దేవస్థానం పాలక మండలి ఆదేశాల మేరకు సత్యదీక్ష స్వీకరించే 108 మంది భక్తులకు దీక్ష వస్త్రాలు, దీక్ష పుస్తకం, స్వామివారి ఫొటోలు అందజేసినట్లు తెలిపారు.

ఎస్ఈఏఎస్‌పై శిక్షణ

ప్రత్తిపాడు: స్థానిక మానవ వనరుల కేంద్రంలో గురువారం స్టేట్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్ సర్వే (ఎస్ఈఏఎస్)పై ప్రధానోపాధ్యాయులు, డిగ్రీ విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు మాట్లాడుతూ 3, 6, 9వ తరగతుల విద్యార్థుల ప్రగతిని సర్వే చేస్తున్నట్టు చెప్పారు. దీనిలో భాగంగా ఆయా తరగతుల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు, డిగ్రీ విద్యార్థులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరీక్షల అనంతరం ఓఎంఆర్ షీట్లను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపిస్తామన్నారు. ఈ పరీక్షల నిర్వాహణపై ఎంఈఓ వి.రాజబాబు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 వై.అచ్చిరాజు, సీఆర్పీలు, ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, వైష్ణవి డిగ్రీ కళాశాల విద్యార్థులు, సీఆర్పీలు పాల్గొన్నారు.



వి.కొత్తూరులో రోగులకు సురక్ష కిట్లు అందజేస్తున్న నాయకులు



ఏలేశ్వరంలో మందుల కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



ప్రత్తిపాడులో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



వేలంకలో రోగులకు మందుల కిట్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని వేలంకలో గురువారం తహసీల్దార్ కేవీ మాధవరావు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ తోట రవి, దోమాల గంగాధర్‌తో కలసి ఎమ్మెల్యే చంటిబాబు ప్రారంభించారు. శిబిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఆయన సందర్శించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో గ్రామాల్లోని ప్రజల వద్దకే మెరుగైన వైద్య సేవలు అందాయన్నారు. నెల రోజుల పాటు గ్రామాల్లో ప్రజలకు అనుభజ్ఞులైన డాక్టర్లు వైద్య సేవలు అందించారన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లు, రోగులకు మందుల కిట్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తోట గాంధీ, సొసైటీ అధ్యక్షులు చదలవాడ బాబీ, సర్పంచ్ రాయుడు స్వామి, అడబాల శ్రీను, గుత్తిర్తి రమణ, చిడ్నీడి శివ, కో ఆప్షన్ సభ్యుడు మీకా, సెక్రటరీ రామిశెట్టి వీర్రాజు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో...

ఏలేశ్వరం: పట్టణంలోని 16, 19 వార్డుల్లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు శ్రీలక్ష్మి, పాపారావు ఆధ్వర్యంలో సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం రోగులకు స్థానిక నాయకులు మందుల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, సామంతుల సూర్యకుమార్, కోరాడ ప్రసాద్, పైల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో పేదలకు కార్పొరేట్ వైద్యం

తుని రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. మండలంలోని వి.కొత్తూరులో గురువారం సర్పంచ్ దుంగల గణపతి రోజారాణి అధ్యక్షతన జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు సురక్ష కిట్లను అందజేశారు. అనంతరం వైద్యులను ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూర్యమణి, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, ఎంపీటీసీ తిరుమలరెడ్డి చిట్టెమ్మ, జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, నాయకుడు చిటికెల వరహాలబాబు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం

ప్రత్తిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి అన్నారు. ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ కల్యాణ మండపం ఆవరణలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మితో కలిసి ఆమె ప్రారంభించారు. మండల వైద్యాధికారి ఆర్ఆర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది 383 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోళ్ల జయశేఖర్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఏడిద రెడ్డినాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు గుడాల వెంకటరత్నం, బెహరా దొరబాబు, ఆకుల వీరబాబు, చెలంకూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రోటరీ యువజనోత్సవాలు

తుని: రోటరీ క్లబ్ యువజనోత్సవాలు శుక్రవారం ప్రారంభమవుతాయని ఆ క్లబ్ తుని శాఖ కార్యదర్శి కె.కిశోర్‌రెడ్డి గురువారం తెలిపారు. రోటరీ రంగం పేరుతో వచ్చె నెల 8 వరకూ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేస్తామని తెలిపారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శంఖవరం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వజ్రకూటం రోడ్డు క్రాసింగ్ వద్ద నూతనంగా స్తంభాలు ఏర్పాటు చేస్తున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. మండలంలోని వజ్రకూటం, దొడ్ల డెయిరీ, అల్పమీ కంపెనీ తదితర ప్రాంతాల్లో ఉదయ 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

11న చలో హైదరాబాద్

కిర్లంపూడి: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కోరుతూ ఈ నెల 11న చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చినట్టు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు మాదిగ తెలిపారు. కిర్లంపూడిలో ఎంఎస్‌పీ జిల్లా ప్రచార కార్యదర్శి దూలపల్లి వెంకటరమణ మాదిగ అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 11న పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశానికి మదిగలందరూ తరలి రావాలని పిలుపు నిచ్చారు.

'ప్రజారక్షణ భేరి' పోస్టర్ ఆవిష్కరణ

ప్రత్తిపాడు: అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 15న విజయవాడలో నిర్వహించే ప్రజారక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల సీపీఎం నాయకుడు రొంగల ఈశ్వరరావు కోరారు. స్థానిక లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ప్రజా రక్షణ భేరి వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు బీఆర్‌టీఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ నుంచి మహా ప్రదర్శనగా సింగ్ నగర్ చేరుకుని, అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ బహిరంగ సభకు కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.శ్రీను, ఎస్. సత్తిబాబు, కె.సతీష్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పింఛన్ల పంపిణీ



భద్రవరంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా రెండోరోజూ గురువారం సామాజిక పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. మండలంలోని 90 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. భద్రవరంలో సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు ఆధ్వర్యంలో వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 25 వేలకు పైగా పింఛన్లు అందజేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతినెలా ఒకటో తేదీనే వలంటీర్ల పింఛన్లు అందజేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ నేతల సంబరాలు హాస్యాస్పదం

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఏడుకొండలు



గోకవరం: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అనారోగ్యాన్ని సాకుగా చూపించి మధ్యంతర బెయిల్ పొందారని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. స్కిల్ కుంభకోణం కేసులో చంద్రబాబు ఇప్పటికీ నిందితుడే అన్నారు. మధ్యంతర బెయిల్ రావడంపై టీడీపీ నేతలు, ఎల్లో మీడియా ఏదో సాధించినట్టు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇది వారి మానసిక వైకల్యానికి సూచన అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఆధారలు ఉండబట్టే న్యాయస్థానాలు చంద్రబాబుకి బెయిల్ నిరాకరించాయన్నారు. దీంతో చంద్రబాబు కంటిచూపు, పైల్స్ ఇతర అనారోగ్య కారణాలను సాకుగా చూపించి మధ్యంతర బెయిల్ పొందారన్నారు. ఇవన్నీ తెలిసి కూడా టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు స్కిల్ కుంభకోణంతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు, అసైన్డ్ ల్యాండ్ వంటి పలు కేసుల్లో ప్రధాన నిందితునిగా ఉన్నారన్నారు. నెలరోజుల మధ్యంతర బెయిల్ తరువాత శాశ్వతంగా జైలులోనే ఉండాల్సి వస్తుందన్న విషయం చంద్రబాబుకు కూడా తెలుసన్నారు. టీడీపీని జాతీయ పార్టీగా చెప్పుకునే చంద్రబాబు తెలంగాణలో పోటీ చేయకపోవడం, ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ రాజీనామా చేయడం చూస్తుంటే తెలంగాణ మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా టీడీపీ సమూలంగా తుడిచిపెట్టుకుపోతుందని జోస్యం చెప్పారు. టీడీపీ ఎన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్నా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 స్థానాల్లో విజయం సాధించి జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం



తునిలో అప్పారావును పరామర్శిస్తున్న దాడిశెట్టి శ్రీనివాస్

తుని: స్థానిక 16వ వార్డుకు చెందిన ఇసరపు అప్పారావుకు దాడిశెట్టి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ దాడిశెట్టి శ్రీనివాస్ ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో అప్పారావుకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ గురువారం అప్పారావును పరామర్శించి రూ.50 వేలు ఆర్థిక సాయం చేశారు. మంచానికే పరిమితమైన అప్పారావును ఆదుకున్న శ్రీనివాస్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత



తుని మున్సిపల్ కార్యాలయంలో దివ్యాంగుడు సత్తిబాబుకు ట్రై సైకిల్ అందజేసిన బాలు మిత్రులు

తుని: స్థానిక 23వ వార్డుకు చెందిన దివ్యాంగుడు సత్తిబాబుకు ట్రై సైకిల్ అందజేసినట్టు వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం దివ్యాంగుడికి ఏలూరి బాలు బాల్య మిత్రులు రూ.20 వేలు విలువ చేసే ట్రై సైకిల్‌ను అందజేశారు. ఇటీవల జరిగిన మన మున్సిపాలిటీ–మన బాధ్యత కార్యక్రమంలో ట్రై సైకిల్ కావాలని అడిగిన బాధితుడికి మానవ దృక్పథంతో సహాయం చేసినట్టు తెలిపారు. తన బాల్య మిత్రులకు బాలు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

రౌతులపూడి: మండలంలోని దిగువశివాడలో పేకాట శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1100, నాలుగు మోటరు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు రౌతులపూడి ఎస్సై అబ్దుల్ నబీ తెలిపారు.

తైక్వాండోలో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

కాకినాడ రూరల్: కాకినాడలో ఇటీవల జరిగిన 21వ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో చాంపియన్ షిప్–2023 రాష్ట్ర స్థాయి పోటీలలో మండలంలోని పి.వెంకటాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చినట్టు ప్రిన్సిపాల్ టి.సుశీల తెలిపారు. వివిధ విభాగాలలో 7 బంగారు, 6 వెండి, 6 కంచు చొప్పున మొత్తం 19న పతకాలను తమ విద్యార్థినులు సాధించినట్టు గురువారం ఆమె విలేకరులకు తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థినులు గగనశ్రీ, గాయత్రి, మన్మితశ్రీ, పాఠశాల విద్యార్థినులు ఎం.స్వేచ్ఛ, రిషిత, అక్షయ, సత్య భవాని, బంగారు పతకాలు సాధించినట్టు తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో గురువారం విజేతలు, పీడీ శారద, పీఈటీ పద్మలను ఆమె అభినందించారు.

అసంపూర్తిగా... అలంకారప్రాయంగా..



కోటనందూరు హైస్కూల్లో అసంపూర్తిగా నిలిచిన బాలికల వసతి గృహం నిర్మాణ పనులు

కోటనందూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో చేపట్టిన బాలికల వసతి గృహం నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. రూ.1.94 కోట్లు ఆర్ఎంఎస్ఏ నిధులతో ఈ హాస్టల్ నిర్మాణ పనులు చేపట్టారు. గతేడాది విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే ఈ హాస్టల్‌ను సిద్ధం చేస్తామని పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీరింగ్ అధికారులు గతంలో ప్రకటించినప్పటికీ ఆ దిశగా పనులు జరగలేదు. శ్లాబు లెవెల్ వరకూ పనులు వేగంగా పూర్తి చేసిన కాంట్రాక్టర్ తదుపరి పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. హాస్టల్ నిర్మాణ పనులు ప్రారంభించి రెండేళ్లు పూర్తి కావస్తున్నా..హాస్టల్‌ను అందుబాటులోకి తీసుకురాకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రమైన కోటనందూరులో ఈ హాస్టల్ అందుబాటులోకి వస్తే మండలంతో పాటు పక్కనే ఉన్న రౌతులపూడి, అనకాపల్లి జిల్లా నాతవరం మండలాల్లో విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హాస్టల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదాత ఆందోళన

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గురువారం మండల వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలంలోని మెట్ట, పల్లపు ప్రాంతాల్లో ఖరీఫ్ వరి చేలు ప్రస్తుతం కోత దశకు చేరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో అకాల వర్షాలు తమ పంటలను దెబ్బతీస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట ఒబ్బిడి చేసేంత వరకూ వాతావరణం అనుకూలంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రౌతులపూడి: రౌతులపూడి–తేటగుంట ఆర్అండ్‌బీ రహదారిలో గిడజాం వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. తేటగుంట వైపు వెళుతున్న క్వారీ లారీ ఎదురుగా మోటరు సైకిల్‌పై వస్తున్న అర్జునరావును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన అర్జునరావును చికిత్స కోసం తుని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నేడు అన్నదానం

కోటనందూరు: స్థానిక శివాలయం ప్రాంగణంలో వేంచేసిన షిర్డీ సాయిబాబా వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం భారీ అన్నదానం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు.

మత్స్యకార సమస్యలపై నేటి నుంచి జాతీయ సమావేశాలు

కాకినాడ సిటీ: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మత్స్యకారుల వ్యతిరేక విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక, సమైక్య జాతీయ ప్రధాన కార్యదర్శి పి.స్టాన్లీ డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం కాకినాడ సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారుల సమస్యలపై పోరాడుతున్న ప్రతినిధులతో అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక, సమైక్య జాతీయ సమావేశాలు ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు కాకినాడలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బ్లూ ఎకానమీ ఆఫ్ షోర్ ఏరియాస్ మినరల్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్ పేరుతో సముద్రంలో ఉన్న 138 లోహాలను వెలికి తీయడానికి పార్లమెంట్‌లో చట్టం చేసి 100 కిలోమీటర్ల చొప్పున ముక్కలు చేసి ప్రైవేట్ బ్యాంకుల ద్వారా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని దీన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు స్టాన్లీ అన్నారు. సమావేశాల్లో దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల నుంచి మత్స్యకార సంఘాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. మత్స్య కార్మికసంఘం రాష్ట్ర నాయకులు కర్రి చంద్రశేఖర్, కొల్లాటి శ్రీనివాసరావు, చెక్కా రమణి తదితరులు పాల్గొన్నారు.

కోటి బిల్వార్చనకు చురుగ్గా ఏర్పాట్లు

- 15 వేల మంది అయ్యప్ప మాలధారణ భక్తులతో పడిపూజ
- హాజరుకానున్న కేరళ పందల వంశీకులు



కోటి బిల్వార్చన ప్రాంగణం వద్ద ఏర్పాట్లు



అర్చనకు కోటి బిల్వాలను సిద్ధం చేస్తున్న వలంటీర్లు

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరులో శివారు ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ఎదురుగా 16వ నంబరు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఆకుల వీర్రాజు స్థలంలో ఈ నెల 4న నిర్వహించే కోటి బిల్వార్చన, పడిపూజలకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తరాంధ్రలో తొలిసారిగా నిర్వహిస్తున్న కోటి బిల్వార్చనలో 15 వేల మంది అయ్యప్ప మాలధారణ భక్తులు, మరో పది వేల మంది సాధారణ భక్తులు పాల్గొనేందుకు అనువుగా ఏర్పాట్లు చేస్తున్నారు. కోటి బిల్వార్చనకు కేరళ శబరిమలై సన్నిధానం నుంచి పందల రాజుల వంశస్తులు, అయ్యప్పస్వామి ఆలయం ప్రధాన అర్చకులు మేల్ శాంతి, తిరు ఆభరణాలు తీసుకువెళ్లే స్వామి, చండా వాయిద్య కళాకారుల బృందం హాజరుకానుంది. మాలధారణ భక్తులకు మౌలిక వసతులు, ఫలహారం వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. సదుపాయాల కల్పనలో స్వచ్ఛంద సంస్థల సేవలను వినియోగించుకోనున్నారు. బిల్వాలు, కొబ్బరి కాయకులు, పూలు, ఇతరేతర సేవలు అందిస్తున్నారు.

పూజా కార్యక్రమాలు

కోటి బిల్వార్చన, పడి పూజ సందర్భంగా శనివారం వివిధ పూజలు నిర్వహించనున్నారు. ఉదయం నాలుగు గంటలకు అష్టద్రవ్య లక్ష్మీగణపతి హోమం, ఎనిమిది గంటలకు దండపాణి గురుస్వామి జయంత్యోత్సవం సందర్భంగా కత్రాళ్ల కొండ అయ్యప్పస్వామి గుడి నుంచి సభస్థలం వరకు భక్తులతో ఊరేగింపు నిర్వహిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు స్వామివారి పడి పూజ, 5.30 గంటల నుంచి కోటి బిల్వార్చన ప్రారంభమవుతుంది. తుని, పాయకరావుపేట అయ్యప్పస్వాముల ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన దండపాణి గురుస్వామి పర్యవేక్షణలో కోటి బిల్వార్చన, పడి పూజ నిర్వహించనున్నారు.